దేశ ప్రగతిలో మహిళల పాత్ర కీలకం

ఖైరతాబాద్, మార్చి 10 : ఆకాశంలో సగభాగంగా కొలిచే మహిళలు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అడ్వాన్స్‌డ్ సైకాలజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు రాజేశ్వర రావు అన్నారు. ఆదివారం సాయంత్రం అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో విద్యార్థి, యువత ఏదో ఒక రూపంలో మానసిక సంఘర్షణకు గురవుతున్నారన్నారు. ఒత్తిడిలో ఉన్న వారికి ఉపశమనం కలిగించేందుకు సైకాలజిస్టులు ముందుంటారని, ఎవరైనా అలాంటి పరిస్థితిని ఎదుర్కొంటే తమను సంప్రదించాలన్నారు. అనంతరం ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ పూర్ణిమా నాగరాజు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ, ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ స్వాతి లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టులు డాక్టర్ వీరేందర్, డాక్టర్ విశేష్, ఏపీఏ ఇండియా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ భరత్, ఉపాధ్యక్షుడు మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాం ప్రసాద్, రేణుక లింగాల, షర్మిల పాల్గొన్నారు.

బాల రాముడిని దర్శించుకున్న జడ్పీటీసీ దంపతులు

శంషాబాద్ రూరల్, మార్చి 10 : అయోధ్యలోని బాలరాముడిని ఆదివారం శంషాబాద్ జడ్పీటీసీ నీరటి తన్విరాజు దంపతులు దర్శించుకున్నారు. మండల ప్రజలు సుఖసంతోషంగా ఉండేవిధంగా శ్రీరాముడు చల్లగా చూడాలని కోరిన్నట్లు తెలిపారు.

బస్తీల్లో సకల వసతులు కల్పిస్తా..

- మధురానగర్ బస్తీలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి పాదయాత్ర

ఎర్రగడ్డ, మార్చి 10 : కాలనీలకు దీటుగా బస్తీలకు సకల వసతులను కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళ్లటం జరుగుతుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్ మధురానగర్ బస్తీలో ఆదివారం ఆయన పాదయాత్ర నిర్వహించి స్థానికులతో కలిసి మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. బస్తీ వాసులతో ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తేవాలని.. వెంటనే పరిష్కరించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం అందుబాటులోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. తాగునీరు, సీవరేజీ పైపులైన్లను జనాభాకు అనుగుణంగా విస్తరించటంతో దీర్ఘకాలిక సమస్యలు దూరమయ్యాయని వివరించారు. ఇంకేమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల ద్వారా వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాదయాత్ర సందర్భంగా అడుగడుగునా స్థానికులు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మధురానగర్ అధ్యక్షుడు ఎం.ఆనంద్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు విజయకుమార్, ఏడీ మధు, బొట్టుశివ, యూసుఫ్, సాయిచరణ్, రమేశ్‌నాయక్, బాబూరావు, రమేశ్, దేవమణి, జీవన్, ధర్మ, వసీం, ఖలీల్, రామకృష్ణయాదవ్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ..

ఎర్రగడ్డలో డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి షరీఫ్‌ఖురేషీ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఆదివారం పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ముఖ్య అతిథిగా విచ్చేసి పలువురికి సరుకులను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవ, జావిద్, జానీమియా, సయీద్‌ఖాన్, అజీమ్, సయ్యద్ రసూల్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

పంటలకు మద్దతు ధర కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ సోమమల్ల

హిమాయత్‌నగర్, మార్చి10 : పంటలకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ప్రొఫెసర్ సోమమల్ల, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ కోరారు. పంటలకు అయ్యే ఖర్చుతో పాటు అదనంగా మద్దతు ధర ఇవ్వాలని డాక్టర్ స్వామినాథన్ చేసిన సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని మఖ్దుం భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. పసుపు రైతులకు ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయకుండా కేంద్రం కాలాయాపన చేస్తుందన్నారు. పంటల బీమా లేకపోవడం తో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ప్రభులింగం, సంజీవరెడ్డి, మురళీధర్‌రెడ్డి, సంధ్య, సురేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రయ్య, నరేశ్, సత్యవతి పాల్గొన్నారు.

రౌడీ షీటర్ తన్నుఖాన్‌పై కేసు..

వెంగళరావునగర్, మార్చి10 : రౌడీ షీటర్ తన్నుఖాన్‌పై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని నాలాపై ఉన్న స్లాబ్‌ను తన్నుఖాన్ ఆక్రమించినట్లు జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ అబ్దుల్ ఫహీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలాపై ఉన్న స్లాబ్ కబ్జా చేసి.. మేకలు, కోళ్లను కట్టి.. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని చేసిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్‌ల కింద తన్నుఖాన్‌పై కేసు బుక్ చేశారు.

పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

బండ్లగూడ/మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 10 : పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్.శ్రీనివాస్‌రావు అన్నారు. రంజాన్ సందర్భంగా మసీదుల నిర్వాహకులతో ఆదివారం సాయంత్రం సమావేశాలు ఏర్పాటు చేశారు. రంజాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు అందజేశారు. డీసీపీ మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారు ఒకరి పండుగలను ఒకరు గౌరవించుకుంటూ స్నేహభావంతో సాగాలన్నారు. పండుగల నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలకు తమ సహకారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో రాజేంద్రనగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్స్పెక్టర్లు నాగేంద్రబాబు, పి.మధు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్‌రావు

పార్కులో పారిశుధ్య పనులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్న సంఘాల ప్రతినిధులు

ఎర్రగడ్డ, మార్చి 10 : రాజీవ్‌నగర్ కాలనీలో ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో మైత్రి వాకర్స్ అసోసియేషన్, హరిత ఫౌండేషన్ వారితో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొని రాజీవ్‌నగర్‌లోని పార్కు-3లో పారిశుధ్య పనులు నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఇప్పటికే కాలనీలో ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు రాజీవ్‌నగర్ కాలనీ గౌరవాధ్యక్షుడు కృష్ణశర్మ పేర్కొన్నారు.

కార్యక్రమంలో వినయసాగర్, విజయానంద్, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, శాస్త్రి, భాస్కర్, మంగరాజు, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

భారత్ జోడో న్యాయ్ మారథాన్..

వెంగళరావునగర్, మార్చి10 : 'భారత్ జోడో న్యాయ్ మారథాన్' ను ఆదివారం మహమ్మద్ అసదుద్దీన్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు నుంచి కోట్లవిజయభాస్కర్ రెడ్డి స్టేడియం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, మాజీ ఎంపీ మహమ్మద్ అజారుద్దీన్, నవీన్ యాదవ్, యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కవిత, జూబ్లీహిల్స్ మహిళా అధ్యక్షురాలు కీర్తి, రహ్మత్‌నగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఆండాలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారథాన్‌లో పాల్గొన్న కాంగ్రెస్ మహిళా ప్రతినిధులు, నాయకులు

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది..

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ, మార్చి 10 : అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఓలం యాదగిరి అన్నారు. ఆదివారం అమావాస్య సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మణికొండలో అన్నదానం చేశారు. ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జ్యోతిష్యం భవిష్యత్‌కు మార్గదర్శకం

తెలుగు యూనివర్సిటీ, మార్చి 10 : జ్యోతిష్యం మూఢనమ్మకం కాదని మంచి భవిష్యత్‌కు మార్గదర్శకమని ప్రొఫెసర్ సాంబశివరావు అన్నారు. ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ ఆధ్వర్యంలో జ్యోతిష్య పండితులకు జ్యోతిష్య శిరోమణి, జ్యోతిష్యగురువు, జ్యోతిష్య భీష్మ, జ్యోతిష్య ఆచార్య, జ్యోతిష్య వాస్తు పండిట్, జ్యోతిష్య వాస్తు రత్న, జ్యోతిష్య విశారద, జ్యోతిష్య బ్రహ్మ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. జ్యోతిష్యంలో విస్తృత పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు.

ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నరసింహస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గోపినాథ్, ఎస్‌వీ రమణారావు, అరుణ్‌కుమార్ పాల్గొని జ్యోతిష్యం విశిష్టతను వివరించారు. జ్యోతిష్య శాస్త్రాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కోర్సులను నిరంతరం అందిస్తున్నామని ఔత్సాహికులు 9652 4755 66నంబర్‌లో సంప్రదించవచ్చని నరసింహస్వామి సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

మణికొండలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీఆర్‌ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

మణికొండ, మార్చి 10 : వేసవిని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాన్ని ప్రారంభించామని వీఆర్‌ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్‌రావు తెలిపారు. దాహార్తిని పొంది సేదతీరడానికి ట్రస్ట్ ఆధ్వర్యంలో తొమ్మిది చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి దశగా ఐదు కేంద్రాలను గీతూస్ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో అల్కాపూర్ రోడ్ నంబర్ 14 హైవ్ జంక్షన్‌లో, నెక్నాంపూర్ బొడ్రాయి దగ్గర దిలీప్‌కక్కడ్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సెక్రటేరియట్ కాలనీ గోల్డెన్ టెంపుల్, ప్రతిభ స్కూల్ ఎదుట, సుందర్ గార్డెన్ షిర్డీ సాయి కూడలి, నర్సింహ్మ స్వామి ఆలయం వద్ద ప్రారంభించామని తెలిపారు. మరో నాలుగు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నిర్మల్‌చంద్ గోలేచా, దిలీప్ కక్కడ్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ ఆలస్యం నవీన్‌కుమార్, తబ్రెజ్‌హుస్సేన్, మోహన్‌కుమార్, నరోత్తం, 7వ వార్డు కౌన్సిలర్ పద్మారావు,ఆరిఫ్, వినయ్ పాల్గొన్నారు.

'దళితులు ఐక్యమై హక్కులు సాధించుకోవాలి '

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్, మార్చి 10 : దళితులు ఐక్యమై హక్కులు సాధించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపు నిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక, లౌకిక వ్యవస్థకు వ్యతిరేకంగా పాలన చేస్తోందని విమర్శించారు. మనువాద సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇది ప్రమాదకరమైన పరిణామమన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు మద్దెల ప్రవీణ్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు చిప్పరి సుబ్బారావు, రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటికాల గణేశ్, నాయకులు రాజు, ఎన్.రాంచందర్, కిరణ్‌కుమార్, సురేశ్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుందాం..



కేఎన్ఆర్ డైమండ్‌హిల్స్ అసోసియేషన్ నూతన కమిటీని సన్మానిస్తున్న నీతారాం, భాస్కర్‌రెడ్డి

మణికొండ, మార్చి 10 : కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుందామని.. దాని కోసమే అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని ముందుకు సాగడం హర్షణీయమని నీతారాం దూళపాటి, కొండకళ్ల భాస్కర్‌రెడ్డి అన్నారు. మణికొండ కేఎన్ఆర్ డైమండ్ హిల్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్వేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా లక్ష్మీశ్రీ, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారిగా మణిక్యంరెడ్డి, సంయుక్త కోశాధికారిగా హరీశ్, సంయుక్త కార్యదర్శిగా వినోద్, లేడీ రిప్రజెంటేటివ్ సమతలను కాలనీ వాసులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం, భాస్కర్‌రెడ్డి ఆదివారం కమ్యూనిటీ హాల్‌లో కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వివాదాలు పరిష్కరించుకోండి..

యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ సేవా ఇస్లావత్

జూబ్లీహిల్స్, మార్చి 10 : ఆస్తిపన్ను వివాదాలను ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార వేదికలో పరిష్కరించుకోవాలని యూసుఫ్‌గూడ డిప్యూటీ కమిషనర్ సేవాఇస్లావత్ అన్నారు. మార్చిలో ప్రతి ఆదివారం ఉదయం 9 : 30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పన్ను పరిష్కార వేదిక ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆదివారం జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ కార్యాలయంలో పరిష్కార వేదిక నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ క్యాంప్‌లో వివాదాల పరిష్కారంతో పాటు వన్ టైం సెటిల్‌మెంట్ ఆఫర్‌లో 2022-23 వరకున్న ఏరియర్స్‌పై 90 శాతం మాఫీ పథకంలో బకాయి ఉన్న పన్ను ఒకేసారి చెల్లించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ కమల్, ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బండ్లగూడ పరిధిలో ఏడు ఫిర్యాదులు

వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

బండ్లగూడ : వినియోగదారులు ఆస్తిపన్నును చెల్లించడంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. ఆదివారం ఆస్తిపన్ను పరిష్కార వేదికలో భాగంగా ఏడుగురు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతుండటంతో పన్నును చెల్లించాలని కోరారు. తద్వారా జరిగే అభివృద్ధికి సహకరించాలన్నారు.

చిరస్మరణీయురాలు.. సావిత్రిబాయి పూలే

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 10 : సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ అన్నారు. రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ పరిధిలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్ కోశాధికారి భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రుద్రకుమార్ పాల్గొన్నారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సావిత్రిబాయి కులమతాలకు అతీతంగా పాఠశాలలు ప్రారంభించి దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా సేవలందించారని, స్త్రీ విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, సచిన్, టి.వెంకటేశ్‌గౌడ్, దత్తు, శశికాంత్, జహంగీ, నరేందర్, రాజేశ్, వెంకట్రావు, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎస్సార్టీ నగర్‌లో...

ఎర్రగడ్డ : బోరబండ డివిజన్ ఎస్సార్టీ నగర్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొట్టుశివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విజయకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్‌సర్దార్, రమేశ్‌యాదవ్, దేవమణి, ఖలీల్, చంద్రశేఖర్, యూసుఫ్, మల్లేశ్, కిరణ్, బాబూరావు, దశరథం, వసంతరావు, శంకర్, నాగమణి, కురుమయ్య, పుల్లయ్య, చెన్నయ్య, పాషా, సాయి పాల్గొన్నారు.



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పోరాడి హక్కులు సాధించుకోవాలి

మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఖైరతాబాద్, మార్చి 10 : దళిత, గిరిజన, బీసీ వర్గాలు తమ హక్కులను పోరాడి సాధించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సమస్యలపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏండ్లు గడుస్తున్నా నేటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు వెనుకబడి ఉన్నారన్నారు. దానికి పాలకుల విధానాలే కారణమన్నారు. ఆయా వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ అధ్యక్షులు మురళీధర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం సెక్రటరీ జనరల్ ఆర్. చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు శివరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. యాదగిరి పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు.. విరివిగా రుణాలు

- మొదటి విడుత రూ.10 వేలు.
- రెండో విడుత రూ.20 వేలు..
- మూడో విడుత రూ.50 వేలు..
- యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 2,076 మందికి రుణ సౌకర్యాలు

కల్యాణ్‌నగర్ యూనియన్ బ్యాంక్‌లో స్ట్రీట్ వెండర్స్‌కు లోన్ పత్రాలు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్‌తో యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు, సిబ్బంది

జూబ్లీహిల్స్, మార్చి 10 : స్వయంఉపాధిని ప్రోత్సహించేందుకు వీధి వ్యాపారులకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రుణాలు ఇస్తున్నారు. స్ట్రీట్ వెండర్స్ వడ్డీ వ్యాపారుల బారినపడి నష్టపోకుండా నగర పాలక సంస్థ అవసరమైన వారికి దశల వారీగా రుణసౌకర్యాలు పెంపొందిస్తున్నారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు ఇస్తూ అవసరమైన వారికి రుణాలు మంజూరు చేస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 6,663 మంది వీధి వ్యాపారులుండగా వారిలో 2076 మందికి రుణ సౌకర్యం కల్పించారు. వీధి వ్యాపారాలు ప్రారంభించేందుకు ముందుకువస్తున్న వారితో పాటు ఇప్పటికే వ్యాపారాలు చేస్తూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి మొదటి విడతగా రూ. 10వేలు బ్యాంక్ లింకేజీ రుణం అందించి వాటిని తిరిగి చెల్లించిన వారికి రెట్టింపు రుణ సౌకర్యాలు కల్పిస్తున్నారు. రెండో విడత రుణాలు తిరిగి చెల్లించిన వారికి మూడో విడుత రూ.50 రుణాలందిస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇప్పటి వరకు 1,378 మంది వీధి వ్యాపారులకు రూ.10 వేలు, 584 మందికి రూ. 20 వేలు, 114 మందికి రూ.50 వేల రుణాలందించినట్లు యూసీడీ అధికారులు తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్ వీధి వ్యాపారులకు రెండు రోజుల క్రితం కల్యాణ్‌నగర్ యూనియన్ బ్యాంక్‌లో స్ట్రీట్ వెండర్‌లోన్ పత్రాలను యూసీడీ అధికారులు బ్యాంకర్‌లతో కలిసి అందజేశారు.

సద్వినియోగం చేసుకోవాలి..

యూసీడీ ఆధ్వర్యంలో అందిస్తున్న రుణ సౌకర్యాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలి. రుణాల కోసం ఇతరుల మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి కోసం వారికి అవసరమైన మేరకు రుణాలు ఇస్తున్నాం. రుణ సౌకర్యాలు పొందేందుకు వీధి వ్యాపారులు విధిగా జీహెచ్ఎంసీ గుర్తింపు కార్డులు ఉండాలి. రుణాలు తిరిగి చెల్లించిన వారికి రెట్టింపు రుణాలిస్తున్నాం.

– వెంకటకిషన్‌రావు, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్

భక్తులకు పండ్లు పంపిణీ

కీసరగుట్టలో భక్తులకు పండ్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

జూబ్లీహిల్స్, మార్చి 10 : సమాజానికి తమవంతు బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ సీఈఓ మల్క యశస్వి పేర్కొన్నారు. పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజకీయాలకతీతంగా సామాజిక సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి స్కూల్ సహకారంతో కీసరగుట్ట భక్తులకు పండ్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, పేద యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.